# చిన్నారులకు ఐఏఎఫ్‌సీ 'వెయ్యి పుస్తకాల' కానుక

డల్లాస్: చిన్నారుల్లో పఠనాశక్తిని పెంపొందించాలనే సదాశయంతో వారికి అవసరమయ్యే పుస్తకాలను అందించే లక్ష్యంతో వెయ్యి పుస్తకాలను అందించేందుకు ఇండియన్-అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్ (భారత్-అమెరికా స్నేహ సమితి, ఐఏఎఫ్‌సీ) ముందుకు వచ్చింది. మార్చి31న ఇక్కడ నిర్వహించిన ఆసియా అమెరికన్ కమ్యునిటి సమావేశాల్లో ఐఏఎఫ్‌సీ ఈ మేరకు ప్రమాణం చేసింది.



డల్లాస్ నగరంలో ఈ నెల 17, 18న చిన్నారుల పుస్తక ప్రదర్శన శాల, సాహిత్య ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ప్రదర్శనశాలలో ప్రి కేజీ నుంచి ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవసరమయ్యే వివిధ కేటగిరిలకు చెందిన వెయ్యి పుస్తకాలను వారికి అందుబాటులో ఉంచాలని సమితి నిర్ణయించిందని ఐఏఎఫ్‌సీ ప్రధాన కార్యదర్శి తోటకూర ప్రసాద్ తెలిపారు. ఓపెనింగ్ మైండ్స్ బై ఓపెనింగ్ బుక్స్ పేరిట నిర్వహించనున్న ఈ పుస్తక ప్రదర్శన కార్యక్రమానికి ఐఏఎఫ్‌సీ బోర్డు డైరెక్టరు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన ప్రకటించారు.

పసితనంలోనే చిన్నారుల్లో పఠనాభిలాషను పెంపొందించాల్సిన అవసరం ఉందని, ఈ కార్యక్రమం ద్వారా డల్లాస్‌లో ఉంటున్న వివిధ సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులతో పాటు స్వల్ప ఆదాయ వర్గాలకు చెందిన విద్యార్థులు లబ్ధి పొందుతారని ప్రసాద్ వెల్లడించారు.

డల్లాస్ మేయర్ భార్య లారా లెప్పెర్ట్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలకు డల్లాస్ చిల్డ్రన్ బుక్ ఫెయిర్ ఛైర్మన్ దాస్వాని, జీడీఏఏసీసీకు చెందిన రీనే దుతియా, ఐఏఎఫ్‌సీ బోర్డు డైరెక్టర్ ఉర్మిల్ షా, ఎంఈఈడీ కేంద్ర డైరెక్టర్ గాల్ జుమాస్, జీడీఏఏసీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో సహా ఆసియన్-అమెరికన్ కమ్యూనిటికి చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు.